# మరమ్మత్

గాంధీగారు థర్డుక్లాసులో ప్రయాణంచేస్తారు, చేయగలరు. నేను చెయ్యను, చెయ్యలేను. ఆ మహాత్ముడెక్కడ, నే నెక్కడ?-ఆయన్ని చూడ్డంతోనే జనం చేతులు మోడ్చి తమ సీట్లను ఖాళీచేసి యిచ్చేస్తారు. మరి ఈ రోజుల్లో నాకు థర్డుక్లాసులో చోటిచ్చే శివుడు ఎవడండీ?

నీతి:— పెద్దలను అనుసరించి మీ ప్రాణాలను హైరాన పెట్టుకోకండి.

* * *

తీసి పారెయ్యండోయి ఆ కబుర్లు! సత్యహరిశ్చంద్రుడిచేత అబద్ధమైనా ఆడించగలరు గాని నాచేత నిజం చెప్పించలేరు. నిజం చెబుతూ కూచోవడమే నా పనికాదు. ఇంకా చాలా చాలా పన్లున్నాయి నాకు. నిజం కావాలా మీకు? ఔనండీ? వెర్రిబాబాయిలు! లాభంలేదు. నన్ను నిష్ఠూరపెట్టకండి. నిజం చెప్పకపోవడం నేను నిత్యం పాటిస్తూండే నీతులలో ఒకటి. ఇదేచెప్పడం-నన్ను మొహమాట పెట్టకండి. నాచేత మీరు నిజం చెప్పించలేరు. నేను నిజం చెప్పడం ప్రారంభించిన అర క్షణంలో మీరంతా ఉరిస్తంభాలకు ఎగబ్రాకుతూ వుంటారు...

* * *

గులాబీకి ముళ్ళున్నాయి, సువాసనావుంది. రెండూ కావలిస్తేనే అది మీ దగ్గరకు వియజం చేస్తుంది. సువాసన కావాల్సిన వాళ్ళు ముళ్లను కూడా యెలానూ పొందడానికి సిద్ధపడే చేతులు జాస్తారు. ఇంక, సువాసన అక్ఖర్లేకుండా కేవలం ముళ్ళు మాత్రమే కావాల్సిన నిర్భాగ్యులికి ఆ ముళ్ళతోబాటు సువాసనకూడా లభించడం అదృష్టంకాదా అంటూండే పెద్దల్ని ఒకరిద్దర్ని నేను బాగా యెరుగుదును. వారు చాలా పొరబడుతున్నారు-ముళ్లు కావాల్సినే ఆసామీ గులాబీ మొక్కదగ్గరకు రాడు. వాడి ప్రయాణం బ్రహ్మజెముడు డొంకవేపు!

* * *

అమ్మాయిలూ! అలా చిక్కిపోతున్నారేం? వెండి తెరమీది హాలీవుడ్ తారలను చూసి మీరు కూడా సన్నపడటానికి ఏదైనా చికిత్స

పొందుతున్నారా ? నామాట వినండి-లావుగా వుండటం మంచిది గాక పోవచ్చును. కాని, మన దేశంలో, మన వాతావరణంలో లావు పాటివాళ్లు సన్నబడటమంటే ఎంత ప్రమాదమో మీకు తెలుసా ? ఫర్వాలేదు, ఇంకో నాలుగు పౌన్లువుంటే ఉన్నారు లెండి. నిండుగా కనిపిస్తారు. మిమ్మల్ని భరించగలిగే రాక్షసుడు మీతోబాటు మరో నాలుగుపౌన్లను భరించలేకపోడు. సన్నబడటానికి ప్రయత్నించారా అంటే మాత్రం...,హరించిపోయి, చనువుగా అయిపోయి ఎందుకూ పనికిరారు. మీ ఒళ్ళు తగ్గడంకాదు ప్రధానం-ఓపిక తగ్గకుండా వుండటం !

* *

ఆఖరు మాట—

గణితశాస్త్రంతో కుస్తీలు పడుతూండే విద్యార్థిబృందాలకు పైథాగొరస్ థియొరం అంటే యేమిటో తెలుసును. దాన్ని కనిపెట్టింది పైథాగొరస్ అనే గ్రీకు వైజ్ఞానికుడు. ఈయన ప్రతిభ గణితంలోనే కాదు. సారస్వతంలోకూడా కనిపిస్తుంది. ఈయన ఒక రచనలో మానవ లోకానికి అమోఘమైన సలహానొకదాన్ని యిచ్చాడు—'శయనాగారంలో భర్త దరిజేరే స్త్రీ తన రవికతోబాటు సిగ్గును కూడా ఎలాగైతే విడిచేసి, మళ్ళీ యివతలికి వచ్చేటప్పుడు రవికతోబాటు సిగ్గును కూడా ఎలాగ ధరిస్తుందో అదేవిధంగా మనం ఎక్కడ ఎలా ప్రవర్తించుకోవాలో బాగా తెలుసుకుని వుండాలి. ఈ విషయంలో ఇంతవరకూ గృహిణిదే పైచెయ్యిగా కనిపిస్తూంది...' అని.

వీధిలో గొడవలు ఆఫీసులోనూ, ఆఫీసులో గొడవలు ఇంటివద్ద భార్యతోనూ, భార్య మంచితనం టీపార్టీలో కనిపించే మిత్రులతోనూ అదేపనిగా చెబుతూంటేనే గాని బ్రతకలేని నిర్భాగ్యులికి పై సలహా ఎంత గుణవర్ధనం !